క్లుప్తంగా

గురుకులాల్లో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మడికొండ: తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల్లో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని మడికొండ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల ప్రిన్సిపాల్ మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23వ తేదీ వరకు చివరి తేదీ ఉండగా దాన్ని 30వ తేదీ వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. అలాగే, కరీంనగర్ జిల్లా అల్గునూర్ విద్యాసంస్థ, గౌలిదొడ్డి బాలికల విద్యాసంస్థ (సీఓఈ)లో 9వ తరగతిలో మాత్రమే రెగ్యులర్ ప్రవేశాల కొరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు www.tswreis.ac.inలో సంప్రదించాలని తెలిపారు.

క్యాన్సర్ వ్యాధిగ్రస్తురాలి కోసం రక్తదానం



వరంగల్: హనుమకొండ ఆరెపల్లిలోని ప్రతిమ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న బోడ మౌనిక అనే వ్యాధిగ్రస్తురాలి అత్యవసర చికిత్స కోసం బి పాజిటివ్ గ్రూపు రక్తం అవసరం పడింది. ఈక్రమంలో సమాచారం తెలిసిన వెంటనే వరంగల్‌లో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న ములుగు జిల్లా ఏటూరునాగారానికి చెందిన బాలోజు ప్రభంజన్ రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్‌లో పనిచేస్తున్న గుల్లపెల్లి శివకుమార్, యువ నేతాజీ ఫౌండేషన్ సభ్యుడు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు గజ్జెల సుమన్ తనను సంప్రదించడంతో బుధవారం రక్తదానం చేసినట్లు ప్రభంజన్ తెలిపారు.

టెట్ పరీక్ష ఫీజు తగ్గించాలి

విద్యారణ్యపురి: టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్ (టెట్)కు దరఖాస్తు పరీక్ష ఫీజును ప్రభుత్వం భారీగా పెంచిందని, ఈ క్రమంలో టెట్ పరీక్ష ఫీజును తగ్గించాలని ఏబీఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హకీంనవీద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఒక్క పేపర్‌కు రూ 200లు, రెండు పేపర్లు రాస్తే రూ 300లు ఫీజు ఉండేదని గుర్తుచేశారు. ఇప్పుడు ఏకంగా ఒక పేపర్‌కు రూ.వేయి, రెండు పేపర్లకు రూ.2 వేలకు పెంచడం సరికాదని పేర్కొన్నారు. పాత ఫీజు విధానాన్నే కొనసాగించాలని సూచించారు.

రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్‌కు సన్మానం



హన్మకొండ: రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్‌ను కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియామకమైన అనంతరం మొదటిసారి నగరానికి వచ్చిన డాక్టర్ రియాజ్‌ను హనుమకొండ ఎక్సైజ్ కాలనీలోని స్వగృహంలో మాజీ కార్పొరేటర్ ఎనుకంటి నాగరాజు, కాంగ్రెస్ నాయకులు టి.సుధాకర్, మండల సమ్మయ్య, అంబీ సాంబరాజు, జనగాం శ్రీనివాస్, తదితరులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు.

గ్రామదేవతకు ప్రత్యేక పూజలు



ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేటలోని రామాలయం వీధులో ప్రతిష్ఠించిన బొడ్రాయికి బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. బొడ్రాయి ప్రతిష్ఠించి 41 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా వేద పండితులు నరసింహామూర్తి, ప్రదీప్‌శర్మ, ఉత్సవ కమిటీ కన్వీనర్ కొల్లూరి యోగానంద్ ఆధ్వర్యంలో బొడ్రాయికి ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి బొడ్రాయిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పూజా కార్యక్రమంలో రామాలయ పూజారి శ్రీధర్ ఆచార్యులు, సత్యనారాయణ, మనోహర్, తిరుపతిరెడ్డి, రామదాసు తదితరులు పాల్గొన్నారు.

సీపీకి ఫిర్యాదు

శాయంపేట : ఓరుగల్లు వైల్డ్‌లైఫ్ సొసైటీ సభ్యుడు మారెపల్లి సునీల్‌ను దూషించిన హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్‌పై చర్య తీసుకోవాలని ఆ సొసైటీ బాధ్యుడు ఇందారం నాగేశ్వర్‌రావు కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన సీపీకి ఫిర్యాదు చేశారు. పత్తిపాక, శాయంపేట తదితర గ్రామాల్లో వన్యప్రాణుల సంరక్షణకు మారెపల్లి సునీల్ కృషి చేస్తున్నారని తెలిపారు. అలాంటి వ్యక్తిపై పురుషపదజాలంతో దూషించిన హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్‌పై చర్య తీసుకోవాలని ఫిర్యాదులో నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు.

జాతరలో భక్తుల రద్దీ

- దర్శించుకుంటున్న భక్తులు
- కొనసాగుతున్న పూజలు

హసన్‌పర్తి: ఎర్రగట్టు గుట్ట వేంకటేశ్వర స్వామి జాతర ప్రాంగణం భక్తులతో కిటకిటలాడుతోంది. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మూడవ రోజు గురువారం రాత్రి భక్తులు తాకిడి ఎక్కువగా కనిపించింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి మొక్కులు సమర్పించారు. ప్రత్యేక దర్శనం వద్ద భక్తులు కిక్కిరిసిపోయారు. హసన్‌పర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం కొనసాగుతోంది. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ప్రత్యేక పూజలు

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో రాజయ్యకు స్వాగతం పలికారు. విశ్వక్సేనా ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కిషన్‌రావు, ధర్మకర్తలు ఆరెల్లి వెంకటస్వామి, కనపర్తి రాజు, సదానందం, వింజమూరి రమణ, సురేష్, మూల నరోత్తం, శైలజ, ప్రశాంత్, సుమంత్, శ్రీనాథ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



క్యూలో ఉన్న భక్తులు



రాజయ్యకు స్వాగతం పలుకుతున్న కమిటీ సభ్యులు

ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ చేపట్టాలి

హన్మకొండ: ఫోన్ ట్యాపింగ్‌పై రాష్ట్ర ప్రభుత్వం సీబీఐతో విచారణ జరిపించాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. హనుమకొండ హంటర్‌రోడ్డులోని సత్యం కన్వెన్షన్‌లో బీజేపీ వరంగల్ పార్లమెంట్ నియోజక వర్గ స్థాయి ఎన్నికల సన్నాహక సమావేశం బుధవారం జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడిందని దుయ్యబట్టారు. సీబీఐ ద్వారానే సమగ్ర విచారణ సాధ్యమని, అప్పుడే ఫోన్ ట్యాపింగ్‌లోని వాస్తవాలు బయటకు వస్తాయన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే అని చెప్పిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు సీబీఐతో విచారణకు ఆదేశించడం లేదంటే ఆ పార్టీలన్నీ ఒక్కటే అని విమర్శించారు. నరేంద్ర మోదీని మరోసారి ప్రధాని కావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. వరంగల్‌లో బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్‌ను గెలిపించాలని కోరారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు, వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ వి.మురళీధర్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవి కుమార్, మాజీ మేయర్ డాక్టర్ టి.రాజేశ్వర్ రావు, వరంగల్ పార్లమెంట్ కన్వీనర్ తాళ్లపల్లి కుమారస్వామి, రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, గురుమూర్తి శివకుమార్, రావుల కిషన్, రత్నం సతీష్ షా, మురళీధర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రేమేందర్ రెడ్డి

వరంగల్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న కోదండరెడ్డి

హసన్‌పర్తి: పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్‌లో పార్టీ అభ్యర్థిని గెలిపించి కాంగ్రెస్ జెండాను ఎగురవేయాలని టీపీసీసీ క్రమశిక్షణ సంఘం చైర్మన్ కోదండరెడ్డి పిలుపునిచ్చారు. 56వ డివిజన్ కార్పొరేటర్ సిరంగి సునీల్‌కుమార్, మాజీ కోఆప్షన్ సభ్యుడు పాషాతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులకు సూచించారు. కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, నాయకులు కృష్ణారెడ్డి, బీరం రవీందర్‌రెడ్డి, కందుకూరి పూర్ణచందర్, రజనీకాంత్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ నిజాయితీ.. బ్యాగు అప్పగింత

కాజీపేట: కాజీపేట పోలీస్ స్టేషన్‌లో ప్రయాణికుడు పోగొట్టుకున్న బ్యాగును అందించి ఓ ఆటోడ్రైవర్ తన నిజాయితీ చాటుకున్నాడు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం ప్రాంతానికి చెందిన రమేష్ బుధవారం కాజీపేట రైల్వే జంక్షన్‌లో రైలు దిగి ఆటో ఎక్కి నిట్ వద్ద దిగిపోయారు. అనంతరం ఆటోలో ప్రయాణికుడు బ్యాగు మరిచిపోయినట్లుగా గుర్తించిన ఆటో డ్రైవర్ దార సూరి.. వెంటనే ఆ బ్యాగును పోలీస్ స్టేషన్‌లో అందజేశాడు. బాధితుడికి సీఐ సుధాకర్ రెడ్డి సమాచారం అందించి బ్యాగును అందజేశారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్ సూరిని అభినందించారు.



బాధితుడికి బ్యాగు అందజేస్తున్న సీఐ

దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం



చల్లని నీరు అందజేస్తున్న క్లబ్, ఫీడ్స్ సభ్యులు

కాశిబుగ్గ: వేసవిలో ప్రయాణికులు, బాటసారుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం ఎంతగానో దోహదపడుతుందని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ క్యాబినెట్ సెక్రటరీ వడియాల నూతన్‌కుమార్, గుండా అమర్‌నాథ్ గుప్తా, వేములపల్లి సునీల్ అన్నారు. వరంగల్ రైల్వే స్టేషన్ సమీపంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ వి101ఎ, హరిప్రియా ఫీడ్స్ ఆధ్వర్యంలో 80 లీటర్ల సామర్థ్యం కలిగిన ఆర్వో వాటర్ ఫ్రిజ్‌ను ఏర్పాటు చేయగా బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండలు తీవ్రత అధికమవుతున్న క్రమంలో చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ వి101ఎ, ఫీడ్స్ సభ్యులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపుపై పోలీసుల దాడి

ఖిలా వరంగల్: అక్రమంగా మద్యం నిల్వ చేసి విక్రయిస్తున్న బెల్ట్‌షాపుపై మిల్స్‌కాలనీ పోలీసులు దాడులు చేసి రూ.14,920 విలువైన నగదు మద్యం స్వాధీనం చేసుకున్నట్లు మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. ఈమేరకు మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ ఆవరణలో కేసు వివరాలను ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు. శివనగర్, పుప్పాలగుట్ట ప్రాంతానికి చెందిన బండారి యాకయ్య ఇంట్లో అక్రమంగా మద్యం నిల్వ చేసి విక్రయిస్తున్నట్లు ఏసీపీ నందిరామ్ నాయక్‌కు విశ్వసనీయ సమాచారం అందిందని తెలిపారు. ఎస్సై మున్నీరుల్లా ఆధ్వర్యంలో బెల్ట్ షాపుపై బుధవారం సాయంత్రం దాడి చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిర్వాహకుడు బండారి యాకయ్యపై కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య వివరించారు. బెల్ట్ షాపుల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



పట్టుబడిన మద్యాన్ని చూపిస్తున్న ఇన్‌స్పెక్టర్ మల్లయ్య

ట్రస్ట్ ద్వారా విస్తృత సేవలందించాలి



ప్రేమ్ హెల్పింగ్ ట్రస్ట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి

కాశిబుగ్గ: ట్రస్ట్ ద్వారా విస్తృత సేవలందించాలని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ సూచించారు. ఓసిటీ వరంగల్ తూర్పు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రేమ్ హెల్పింగ్ ట్రస్ట్‌ను మంత్రి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలవాలని నిర్వాహకులను కొండా సురేఖ కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ నర్మెట ప్రేమ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు మీసాల ప్రకాష్, సిలువేరు శ్రీనివాస్, సందెల లాజర్, పోలెపాక సుధాకర్, మార్క్ జాన్సన్, ట్రస్ట్ సభ్యులు సుగుణ, వేణు, శంకర్, ఆదిత్య, తదితరులు పాల్గొన్నారు.

కత్తితో దాడి.. వ్యక్తికి గాయాలు

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ జూబ్లీ మార్కెట్ ప్రాంతానికి చెందిన పల్లపు లక్ష్మణ్ అనే వ్యక్తిపై ఇంటి పక్కన ఉండే చీకటి సుశీల్ కుమార్ కత్తితో దాడి చేశాడు. దాంతో లక్ష్మణ్ తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడి భార్య పల్లపు మహేశ్వరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం సాయంత్రం లక్ష్మణ్ తన ఇంటి ముందు నల్లా కోసం తీసిన గోతిలో ఉన్న రాళ్లను తొలగించి చీకటి సమయ్య గోడ పక్కన పెడుతుండగా ఇంట్లో ఉన్న సుశీల్ కుమార్ కత్తితో బయటకు వేగంగా వచ్చి ఆవేశంగా లక్ష్మణ్‌పై దాడి చేశాడు. మెడ, చెంపకు తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రికి తరలించగా చికిత్స అందిస్తున్నారు. అకారణంగా తన భర్తపై దాడి చేసి హత్యాయత్నం చేసిన నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని మహేశ్వరి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు సీఐ సుధాకర్ రెడ్డి తెలిపారు.

దాడి చేసిన వ్యక్తిపై చర్య తీసుకోవాలి

ఎంజీఎం: విధుల్లో ఉన్న తనను కొందరు వ్యక్తులు తీవ్ర పదజాలంతో దూషిస్తూ, దాడికి పాల్పడ్డారని ఎంజీఎం ఆస్పత్రి ఈసీజీ టెక్నీషియన్ రాచర్ల సునీల్.. మట్టెవాడ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. బాధితుడు సునీల్ తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం రాత్రి తను విధుల్లో ఉన్న సమయంలో డాక్టర్ సూచన మేరకు ఒక రోగికి ఈసీజీ తీస్తున్న క్రమంలో ఆ సమయంలో మరో రోగి బంధువులు వచ్చి తమ పేషంట్‌కే ముందు ఈసీజీ తీయాలని వారు తనతో దురుసుగా ప్రవర్తించారని వివరించారు. తన చొక్కా చింపి, పిడి గుద్దులతో తీవ్రంగా గాయపర్చారని వాపోయారు. తనపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని మట్టెవాడ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సునీల్ తెలిపారు.

సిద్ధాంత గ్రంథాలు మంచి పాఠ్యాంశాలుగా నిలవాలి



బాబురావును సన్మానిస్తున్న వలస పైడి

హన్మకొండ కల్చరల్: పరిశోధక విద్యార్థులు సమర్పించే సిద్ధాంత గ్రంథాలు భావితరాల విద్యార్థులకు మంచి పాఠ్యాంశాలుగా నిలవాలని తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి ప్రొఫెసర్ భూక్య బాబురావు సూచించారు. హంటర్‌రోడ్డులోని జానపద గిరిజన విజ్ఞానపీఠంలో బాబురావు అధ్యక్షతన బుధవారం జరిగిన పరిశోధక విద్యార్థి వలస పైడి పరిశోధన చేసిన 'తెలంగాణలో మాల ఉపకులాల సామాజిక సాంస్కృతిక జీవితం – సాహిత్య పరిశీలన' అనే అంశంపై పీహెచ్‌డీ ప్రీ-సబ్‌మిషన్ సెమినార్ జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ భూక్య బాబురావును వలస పైడి సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ శ్రీమంతుల దామోదర్, డాక్టర్ చూరెపల్లి రవికుమార్, డాక్టర్ బాసని సురేష్, అబ్బు గోపాల్‌రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ డాక్టర్ గంపా సతీష్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



నయీంనగర్: టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఉమ్మడి వరంగల్ జిల్లా కోశాధికారిగా సేవలందించిన సీనియర్ జర్నలిస్ట్ ఎం.సుధాకర్ రావు కుటుంబానికి మరిపెడ మండల శాఖ తరఫున రూ.10వేలు అందించారు. హనుమకొండలోని స్వగృహంలో బాధితులకు ఐజేయూ నేతలు దాసరి కృష్ణారెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గడ్డం రాజిరెడ్డి, తోట సుధాకర్ బుధవారం అందజేశారు.

మూడోసారి ప్రధాని మోదీ..



హసన్‌పర్తి: మూడోసారి మళ్లీ మోదీ ప్రధాన మంత్రి కావడం ఖాయమని వరంగల్ బీజేపీ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. 56వ డివిజన్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు గోపగాని దినేష్, ఆరెపల్లి రాజు, సందీప్, తోట ప్రేమ్‌కుమార్‌తో పాటు పలువురు నాయకులు బుధవారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి రమేష్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి – సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలని కోరారు.

అలుముకున్న అంధకారం



వీధి దీపాలు లేని కడిపికొండ బైపాస్ రోడ్డు



రాత్రివేళ చీకట్లోనే వెళ్తున్న వాహనదారులు

- కడిపికొండ బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేయని వీధి దీపాలు
- కూడళ్లలో కానరాని హైమాస్ట్ లైట్లు
- రాత్రివేళలో ప్రయాణానికి జంకుతున్న వాహనదారులు
- నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా పట్టింపు కరువు

కాజీపేట అర్బన్: 44వ డివిజన్ పరిధిలోని కాజీపేట మండలంలోని కడిపికొండ గ్రామానికి ఆనుకుని ఉన్న ఖమ్మం బైపాస్ రోడ్డులో రాత్రివేళ అంధకారం అలుముకుంటోంది. ఈ రోడ్డులో వీధి దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుతున్నాయి. అయినా కూడా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు.

జంకుతున్న వాహనదారులు

వీధి దీపాలు లేని బైపాస్ రోడ్డులో వెళ్లడానికి వాహనదారులు, ప్రయాణికులు జంకుతున్నారు. కడిపికొండ కల్వర్టు నుంచి భట్టుపల్లి వరకు వీధి దీపాలు లేవు. కూడళ్ల వద్ద హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయలేదు. వాహనాల లైట్ల వెలుతురులోనే ప్రయాణం చేయాల్సి వస్తోందని వాహనదారులు చెబుతున్నారు. ఖమ్మం బైపాస్ రోడ్డు మీదుగా వరంగల్, హంటర్‌రోడ్డు, ఖమ్మం వెళ్లేందుకు వాహనదారులు, ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. కడిపికొండలోని రాజీవ్‌గృహకల్ప సముదాయం ఎదురుగా రాత్రి వేళల్లో తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల చొరవ చూపి వీధి లైట్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

భూదాన్ భూముల ఆక్రమణలపై విచారణ జరపాలి

నయీంనగర్: భూదాన్ భూములకు రక్షణ కల్పించి, భూదాన్ భూముల ఆక్రమణలపై సీఐడీతో విచారణ జరపాలని తెలంగాణ సర్వోదయ మండలి రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ నాయక్ డిమాండ్ చేశారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భూదాన్ బోర్డును తిరిగి పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఆ భూముల్లో అవినీతి, అక్రమాలు జరుగుతున్నా గత ప్రభుత్వం పట్టించుకోకుండా భూదాన్ బోర్డు రద్దు చేసి రూ.కోట్ల విలువ చేసే భూములతో భూదందా చేసిందని విమర్శించారు. రూ.వేల కోట్ల విలువ చేసే భూదాన్ భూములను మై హోమ్ రాజేశ్వర్ రావు, అక్రమార్కులు ఆక్రమించుకొని కట్టిన ఫ్యాక్టరీలు, కోటలను కూల్చి నిరుపేదలకు పంపిణీ చేసే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కొందరు భూస్వాములు, రాజకీయ నాయకులు భూదాన్ భూములను దానంగా ఇచ్చినట్లే ఇచ్చి వారే అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఖాళీగా ఉన్న భూదాన్ భూములను గుర్తించి అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సభ్యులు ప్రభాకర్ రావు, శ్రావణ్ నాయక్, రామస్వామి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్‌నాయక్

టీఎస్ ఈసెట్ వాయిదా వేయాలి



నిరసన తెలుపుతున్న నాయకులు, విద్యార్థులు

రామన్నపేట: పాలిటెక్నిక్ విద్యార్థులు ఇంజనీరింగ్‌కు వెళ్లడానికి నిర్వహించే టీఎస్ ఈసెట్ –2024 పరీక్షను వెంటనే వాయిదా వేయాలని ఏఐడీఎస్‌ఓ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఏఐడీఎస్‌ఓ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ విద్యార్థులతో కలిసి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలిటెక్నిక్ మూడవ సంవత్సరం విద్యార్థులకు ఏప్రిల్ 25నుంచి 30వ తేదీ వరకు పరీక్షలు ఉన్నాయని, అవి కాగానే స్వల్ప వ్యవధిలోని ఏప్రిల్ 6న ఈసెట్ పరీక్ష ఉందని తెలిపారు. ఈక్రమంలో విద్యార్థులకు ఆ పరీక్షకు సిద్ధం కావడానికి కేవలం 5రోజుల సమయమే ఉందని వాపోయారు. అంత తక్కువ సమయంలో విద్యార్థులకు పూర్తి స్థాయిలో సన్నద్ధం కాలేరని తెలిపారు. పరీక్షలు ముగిసిన అనంతరం రెండు వారాల సమయం కేటాయించి ఈసెట్ పరీక్ష నిర్వహించేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, రేవంత్, కీర్తన, విద్యార్థులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా బెల్ట్‌షాపులు

- మందుబాబుల ఇష్టారాజ్యం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు

కాజీపేట: కాజీపేట పట్టణంతో పాటు విలీన గ్రామాల్లో విచ్చలవిడిగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులతో స్థానికులు అనేక ఇక్కట్లు పడుతున్నారు. మద్యం షాపుల యాజమానులు దగ్గరుండి బెల్టుషాపులకు మద్యం సరఫరా చేస్తుండడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా టాస్క్‌ఫోర్స్, పోలీస్, ఎక్సైజ్ సిబ్బంది చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండంతో పట్టణంలోని పలు కాలనీల్లో విచ్చలవిడిగా దుకాణాలు వెలిశాయి.

ఎక్కడ చూసినా..

ప్రభుత్వం బెల్టుషాపులకు అనుమతి లేదని స్పష్టంగా ప్రకటించినప్పటికీ ఎక్కడ చూసినా మద్యం విక్రయాలు జోరుగా సాగుతుండడం పెద్ద చర్చనీయంశంగా మారింది. కాజీపేట – సోమిడి ప్రధాన రహదారిపై పలు బెల్టుషాపులు నడుస్తున్నా సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుండంపై విమర్శలు వినిపిస్తున్నాయి. రాత్రి, పగలు అనే తేడాలేకుండా బెల్ట్‌షాపుల్లో మద్యం అమ్మకాలు జరుగుతుండడంతో మందుబాబుల హడావిడి ఎక్కువగా కనిపిస్తోంది. పది, ఇరువై రూపాయలు ఎక్కువైనా సమయానికి మద్యం దొరుకుతుండటంతో మద్యపాన ప్రియులు బెల్ట్‌షాపుల వైపే మొగ్గు చూపుతున్నారు. బాగా కిక్కు ఎక్కిన అనంతరం అసభ్య పదజాలంతో గట్టిగా కేకలు వేయడం, ఒకరినొకరు తిట్టుకుంటూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. రాత్రి వేళలో తమ ఇళ్లలోని బట్టలు, సామానులను తాగుబోతులు ఎత్తుకెళ్లడం, ఆరుబయట పడేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ప్రశ్నిస్తే గొడవకు దిగుతున్నారని చెబుతున్నారు.



బహిరంగంగా మద్యం తాగుతున్న మందుబాబులు

ఫిర్యాదు చేసినా..

చీకటి పడితే బెల్ట్ షాపులున్న మార్గాల్లో మహిళలు రాకపోకలు సాగించడానికి అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులతోపాటు పోలీసులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బెల్టుషాపుల్లో మద్యం అమ్మకాలతో సంస్థకు ఎక్కువ ఆదాయం సమకూరుతుందని భావిస్తుండడమే అధికారులు పట్టించుకోకపోవడానికి ప్రధాన కారణంగా పలువురు చెబుతున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని ప్రజలకు ఇబ్బందికరంగా మారిన బెల్ట్‌షాపులను మూసివేయించాలని స్థానికులు కోరుతున్నారు.